క్లుప్తంగా

రైల్వే కూలీలకు ట్రాలీ వితరణ



ట్రాలీబండి వద్ద రైల్వే కూలీలతో సిరిసహస్ర

విజయనగరం టౌన్: మంచిని పెంచుదాం.. మంచిని పంచుదామనే నినాదంతో దూసుకుపోతున్న చిన్న శ్రీను సోల్జర్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సిరిసహస్ర రైల్వే కూలీలకు గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతో కార్మికుల ఆనందానికి అవధుల్లేవు. రైల్వేస్టేషన్ ఆవరణలో రైల్వే కూలీలకు లగేజీ తీసుకెళ్లే ట్రాలీని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె రైల్వే కూలీలతో మాట్లాడుతూ వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వారికి దుస్తులు అందజేసి, వారితో అల్పాహారం చేశారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ట్రాలీ ఇవ్వడంతో కూలీలంతా సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు తోట వాసు, సభ్యులు జగదీష్, శివ, దక్షిణామూర్తి, హేమంత్, రామకృష్ణ, శ్రీనివాసరాజు, చందక శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెత్తందారీ విధానాలు విడనాడాలి..



మాట్లాడుతున్న రామారావు, లక్ష్మణరావు, తదితరులు

నెల్లిమర్ల: సీఎం జగన్ మోహన్‌రెడ్డి సింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా దళితుడిని నియమించడాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు పెత్తందారీ పోకడలతో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సముద్రపు రామారావు, నాయకుడు ధవళ లక్ష్మణరావు అన్నారు. జరజాపుపేటలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎంఎ, బీఈడీ చదివి కుటుంబ పోషణ కోసం టిప్పర్ డ్రైవర్‌గా పని చేసుకుంటున్న వీరాంజనేయులు పట్ల చంద్రబాబు చులకనగా మాట్లాడడం తగదన్నారు. పెత్తందారీ, నిరంకుశ విధానాలు విడనాడకపోతే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. తక్షణమే చంద్రబాబు దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టిగిడి శ్రీను, నల్లి శివ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

భోగాపురం: మండలంలోని మహారాజుపేట జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో మోదవలస గ్రామానికి చెందిన చెల్లుబోయిన బంగార్రాజు స్కూటీపై 16 మద్యం సీసాలు తరలిస్తూ పట్టుబడ్డాడు. వాహనాన్ని, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

మేలు జరగకే ఎన్‌డీఏ నుంచి బయటకు వచ్చాం..

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు
- వైఎస్సార్‌సీపీ ప్రోత్సాహంతోనే నిరసనలు : టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసులురెడ్డి



మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు, పక్కన టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్: గత ఎన్‌డీఏ ప్రభుత్వంలో రాష్ట్రానికి మేలు జరగకపోవడంతోనే రాజీనామాలు చేసి బయటకు వచ్చేశామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడును ప్రకటించిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా పని చేస్తున్న అప్పలనాయుడిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. 2014 – 19 మధ్య కాలంలో ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి 18 హామీలు ఇచ్చినా, వాటిని నెరవేర్చకపోవడంతోనే నాతో సహా మిగతావారు రాజీనామా చేయడం జరిగిందని చెప్పారు. వలంటీర్లను నిలిపివేయడం ఎన్నికల కమిషన్ నిర్ణయమని, దీనికి టీడీపీతో ఎటువంటి సంబంధం లేదన్నారు. టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, మా దగ్గర సీటు రాని వారితో వైఎస్సార్‌సీపీ నిరసనలు చేయిస్తోందని ఆరోపించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. అశోక్‌గజపతిరాజు నాయకత్వంలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఏడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులను కలుపుకొని వెళతానన్నారు. కార్యక్రమంలో నెల్లిమర్ల, విజయనగరం ఎమ్మెల్యేల అభ్యర్థులు లోకం మాధవి, అదితి గజపతిరాజు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి కలిశెట్టికి షాక్..

ఎంపీ అభ్యర్థి పరిచయ కార్యక్రమానికి రాజాం, ఎచ్చెర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థులు ముఖం చాటేశారు. కలిశెట్టికి టికెట్ ఇవ్వడంపై వారంతా గుర్రుగా ఉన్నారని, అందుకే గైర్హాజరయ్యారని టీడీపీ నాయకులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

హామీలన్నీ అమలుచేశాం..

- జమ్మునారాయణపురంలో ఎన్నికల ప్రచారం
- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కోలగట్లకు ఘన స్వాగతం పలికిన ప్రజలు



జమ్మునారాయణపురంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోలగట్ల, తదితరులు



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పాలన అందించింది.. రానున్న రోజుల్లో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. మండలంలోని జమ్మునారాయణపురంలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఇరు నేతలు తమ ప్రాంతానికి చేరుకోవడంతో స్థానికులలో ఆనందం వ్యక్తమైంది. ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల నడుమ వారికి ఘనంగా స్వాగతం పలికారు. పులివేషాలు, డప్పు వాయిద్యాలతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. మహిళలు హారతులిచ్చి, విజయ తిలకం దిద్ది దీవించారు. పండగ వాతావరణంగా జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే కోలగట్ల ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా జరుగుతున్నాయని చెప్పారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను శతశాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వలంటరీ, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పథకాలు అందించినట్లు తెలిపారు. ఒకటో తేదీకల్లా వృద్ధులకు పింఛన్లను నేరుగా తెచ్చి అందించామన్నారు. కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో విజయనగరం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. నగరంలో ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్యను కోలగట్ల పరిష్కరించారని, ఇందుకోసం పట్టణంలో 11 వాటర్ ట్యాంక్‌లు, 585 ఇంటర్ కనెక్షన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. నగరంలోని ముఖ్య కూడళ్లను అభివృద్ధి చేసి నగర అందాన్ని మరింతగా తీర్చిదిద్దారని కొనియాడారు. మరోసారి ఎంపీగా తనకు.. ఎమ్మెల్యేగా కోలగట్లకు మరోసారి అవకాశం ఇచ్చినట్లయితే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథరావు, కేఏపీ రాజు, సర్పంచ్ యడ్ల సత్తిరాజు, సువ్వాడ శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతిపిత ఆశయాలు అనుసరణీయం



అహింసా రన్ జ్యోతిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం టౌన్: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు భావితరాలకు అనుసరణీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఐఐఎఫ్ఎల్, జీతో స్వచ్ఛంద సంస్థ మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అహింసా రన్ కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరితంగా సాగింది. ఎన్‌సీఎస్ జంక్షన్ వద్దనున్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన మూడు కిలోమీటర్ల మారథాన్‌ను కోలగట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అహింసామార్గాన్ని అనుసరించి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతిపితగా వెలుగొందుతున్నారన్నారు. అటువంటి అహింసా మార్గాన్ని మననం చేసుకుంటూ జీతో మహిళా విభాగం అహింసా రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ర్యాలీలో సుమారు 400 మంది పాల్గొన్నారు కార్యక్రమంలో జీతో మహిళా విభాగం చైర్‌పర్సన్ రీమా కొఠారి, చీఫ్ సెక్రటరీ హర్షిత సురానా, పాయల్, నేహా, జ్యోతి బచావత్, మీతా, హర్షిత, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో రన్ ఫర్ జీసస్

- జెండా ఊపి ప్రారంభించిన డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం టౌన్: ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి జెండా ఊపి ప్రారంభించారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి క్రైస్తవులు భారీ ఎత్తున కదిలివచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ చార్లీ టామ్, రెవరెండ్ అభిశక్తి రాజు, రెవరెండ్ అలజంగి రవికుమార్, బి.ఇమ్మానుయేల్, పాస్టర్స్ అశోక్, శామ్యూల్ అధిక సంఖ్యలో క్రీస్తు సహోదరులు పాల్గొన్నారు.

ఏసు సర్వలోక రక్షకుడు..

విజయనగరం టౌన్: ఏసుక్రీస్తు సర్వలోక రక్షకుడని కంటోన్మెంట్ ఈస్ట్ కోస్ట్ జూట్‌మిల్లు వద్దనున్న ఏసు ప్రార్థనామందిరం బ్రదర్ బి. రఘు, బ్రదర్ ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రీస్తు సహోదరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మే నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులైతే రూ.200.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ.150 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు.

తప్పుడు ఆరోపణలు తగవు

- కాళ్ల గౌరీశంకర్ వ్యాఖ్యలను ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: అభివృద్ధి స్ఫూర్తి ప్రదాత, నిస్వార్థ రాజకీయ నాయకుడు కోలగట్ల వీరభద్రస్వామిపై అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, తదితరులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఈమధ్య కాలంలో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ గౌరీశంకర్ తమ నాయకుడు కోలగట్ల వీరభద్రస్వామిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కుయుక్తులకు పాల్పడుతున్నారన్నారు. మరోసారి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎంతోమంది పేదలు, మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక అవసరాలను తీర్చే కల్పతరువుగా ఉండే అర్బన్ బ్యాంక్‌ను భ్రష్టుపట్టించిన చరిత్ర గౌరీశంకర్‌దేనన్నారు. ఈ విషయం నగరంలో ఉన్న ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. కోలగట్ల వీరభద్రస్వామి అంచలంచెలుగా ఎదుగుతుంటే చూసి ఓర్వలేకే ఇటువంటి ఆరోపణలు చేస్తున్నాడని ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉంటే కోలగట్లను రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. పార్టీ మండల కార్యాలయాన్ని, నగరపాలక సంస్థ కార్యాలయాన్ని తన అధీనంలో కోలగట్ల ఉంచుకున్నారని ఆరోపించడం అర్థరహితమన్నారు. ఏ ప్రాంతం అయితే రాజకీయంగా ప్రోత్సాహం అందించిందో ఆ ప్రాంతానికి గాని, ఆ వర్గానికి గాని ఎటువంటి మేలు చేయని చరిత్ర గౌరీకే చెందుతుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్ కనకల నాగవల్లి, జయరాం, అవనాపు రాజు, కాళ్ల సూరిబాబు, బేరి సత్యనారాయణ, సూర్యుడు, కాళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

- జిల్లా యువజన విభాగం నాయకుడు ఈశ్వర్‌కౌశిక్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయంలో యువజన విభాగం కీలకపాత్ర పోషించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌కౌశిక్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి ఆదేశాల మేరకు జొన్నవలస, చిల్లపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత యువజన విభాగంపై ఉందన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థతో 1.4 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం జరిగిందని చెప్పారు. 2.5 లక్షల మంది వలంటీర్లను నియమించడంతో పాటు స్కిల్ డవలప్‌మెంట్ విభాగం ద్వారా పరిశ్రమలు, ప్రముఖ సంస్థల్లో వేలాది మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్న విషయాన్ని ఇంటింటికీ తెలియజేయాలని సూచించారు. విద్యా, వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, తద్వారా ప్రజలకు జరుగుతున్న మేలును వివరించాలన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలతో ఎక్కడ తాము ఓడిపోతామన్న భయం కూటమి పార్టీలకు పట్టుకుందన్నారు. దీంతో చంద్రబాబునాయుడు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, యువజన విభాగం నాయకులు కోరాడ రవికుమార్, కునుకు నాగరాజు, పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టొద్దు..

- ఇంటివద్దే పింఛన్ పంపిణీతో ఎంతో మేలు
- మళ్లీ కార్యాలయాలకు వెళ్లాలంటే నరకమే
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అవ్వాతాతలు



దేవుని నెలివాడలో పింఛన్ల పంపిణీ(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: వృద్ధాప్య, వితంతు పింఛన్‌దారులకు ఇంతవరకు ఇళ్ల వద్దే వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేసేవారు. కోడి కూయకముందే ఒకటో తేదీన పింఛన్ల సొమ్ము అందించేవారు. ఈ నెల కూడా ఎప్పటిలాగే వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో టీడీపీకి చెందిన పలువురి ఫిర్యాదుతో...వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయరాదంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయం కాస్తా అవ్వా, తాతల దృష్టికి వెళ్లడంతో వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 39,922 మంది లబ్ధిదారులుండగా వారందరికీ ఈ ఐదేళ్లు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇంటివద్దనే పింఛన్ అందజేశారు. ఈ నెల నుంచి పింఛన్ సచివాలయాలకు వెళ్లి తీసుకోవాల్సి ఉందని తెలియగానే లబ్ధిదారులందరూ లబోదిబోమంటున్నారు.

ఏ నెలా పింఛన్ ఆగలేదు..



జగన్‌బాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతినెలా ఒకటో తారీఖునే పింఛన్ సొమ్ము అందేది. ఒకటో తేదీ పొద్దు పొద్దున్నే వలంటీర్ మా ఇంటికి వచ్చి నిద్రలో ఉన్న నన్ను మేల్కొలిపి మరీ పింఛన్ ఇచ్చేవారు. ఎన్నికల నేపథ్యంలో మళ్లీ కార్యాలయాలకు వెళ్లడమంటే భయమేస్తోంది.

–పంచాది జగ్గునాయుడు, వల్లూరు గ్రామం

గతంలో ఇబ్బందులు పడ్డాం..



గతంలో పింఛన్ పొందేందుకు నానా అవస్థలు ఎదుర్కొనే వాళ్లం. కార్యాలయాల వద్ద పడిగాపులు పడేవాళ్లం. చాలా మంది బీపీ, సుగర్‌తో సొమ్మసిల్లి పడిపోయేవారు. ఇప్పుడు మాకు అలాంటి పరిస్థితి లేదు. ఇంటివద్దకే పింఛన్ పంపిణీతో ఎంతో మేలు జరుగుతోంది. గత చేదు అనుభవాలు మాకొద్దు. మాతో కూడా రాజకీయాలు చేయడం సరికాదు.

–ధవళ రాములమ్మ, మొయిద గ్రామం

నిమ్మగడ్డ.. చంద్రబాబు మనిషే..



చంద్రబాబుకు అత్యంత ఆప్తుడైన నిమ్మగడ్డ రమేష్ వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేయవద్దని కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాసి ఆపించడం దుర్మార్గం.చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ ముగ్గురూ వలంటీర్ వ్యవస్థపై కక్ష కట్టారు. వృద్ధులకు ఇబ్బంది పెట్టడం సరికాదు.

– రేగాన శ్రీనివాసరావు, టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్.

శిష్టకరణ ఆత్మీయ సదస్సుకు సర్వం సిద్ధం

విజయనగరం టౌన్: శిష్టకరణ ఆత్మీయ సదస్సుకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా శిష్టకరణ సంఘ అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయం ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న రింగురోడ్డులో ఉన్న లీ పారడైజ్ ఫంక్షన్ హాల్‌లో విజయనగరం శిష్టకరణాల ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సహాయం

చీపురుపల్లి: ఆకులపేట గ్రామానికి చెందిన పతివాడ రమణ క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి అమెరికాలో ఉంటున్న సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాడివాక బిందు రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నగదును మృతుడి భార్య రమ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. సంబంధిత డిపాజిట్ పత్రాలను ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మృతుడి భార్యకు ఆదివారం అందజేశారు.

నేటి నుంచి పాలిసెట్‌పై ఉచిత శిక్షణ

చీపురుపల్లి: స్థానిక జి.బి.ఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సోమవారం నుంచి పాలిసెట్ లో ప్రవేశం కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి ఆదివా రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 26న పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో రోజూ ఉద యం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూసపాటిరేగలో జోరందుకున్న అభివృద్ధి

- కళకళలాడుతున్న కాలనీలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పూసపాటిరేగలో నిర్మించిన డ్రైనేజీ



కాలనీలో వేసిన సీసీ రోడ్డు

పూసపాటిరేగ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసింది. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కృషితో పూసపాటిరేగలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడ్డారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో డ్రైనేజీలు, సీసీ రహదారులు, తాగు నీటి కుళాయిల సౌకర్యం కల్పించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా మురుగునీరు ఇళ్ల వద్దనే నిల్వ ఉండిపోవడంతో బూడివీధి, ఏతపేట, కెల్లవీధి కాలనీ వాసులు ఇబ్బంది పడ్డారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే రూ. 50 లక్షలు మంజూరు చేయిండంతో డ్రైనేజీలు నిర్మించారు. అలాగే తులసిదిబ్బ గ్రామస్తులు కూడా కాలువలు లేక ఇబ్బందిపడుతుండడాన్ని గమనించిన ఎమ్మెల్యే రూ. 5 లక్షలు మంజూరు చేయగా...బూడివీధి నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు శిథిల డ్రైనేజీని తొలగించి కొత్తది నిర్మించారు. ఏతపేట నుంచి బూడివీధి వరకు రూ. 4 లక్షలతో డ్రైనేజీ ఏర్పాటు చేశారు. అలాగే బూడివీధిలో సీసీ రహదారి కూడా వేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించారని గ్రామస్తులు ఆనందంతో చెబుతున్నారు.